ఇంకా పూర్తి కాని కౌలు రైతు కార్డుల పంపిణీ

- సీజన్ ప్రారంభమైనా సీసీఆర్‌సీ కార్డులు పొందని కౌలు రైతులు
- అర్హులైన దరఖాస్తుదారులకు ఇచ్చేందుకు సిద్ధమంటున్న అధికారులు



కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

ఉండి: నియోజకవర్గంలో కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఈ యేడాది రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా సహాయం అందిస్తే అది తమకు అందకుండా పోతుందేమో అనే ఆందోళనలో కౌలు రైతులు ఉన్నారు. సాగుహక్కు ధ్రువీకరణ పత్రం కౌలు రైతుకు చాలా ప్రాముఖ్యమైంది. అయితే కూటమి ప్రభుత్వం ఆలస్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు కొద్ది రోజులు సర్వర్ డౌన్ కావడంతో సీసీఆర్‌సీ కార్డుల జారీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతుంది. ప్రస్తుత వరిసీజన్ ప్రారంభం కావడంతో కౌలురైతుకు కావలసిన సహాయం ఏదైనా పొందాలంటే దానికి సీసీఆర్‌సీ కార్డు తప్పనిసరి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్డుల జారీ ప్రక్రియ వేగంగా జరిగింది. దానితో పాటు కౌలు రైతును ఆదుకునేందుకు విత్తనాలు, ఎరువులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేసింది.అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డు అందజేతను ఓ సాధారణ కార్యక్రమంగా తీసుకోవడంతో ఇంకా పంపిణీ పూర్తి చేయలేకపోయింది. ఇప్పటికైతే కౌలు రైతు కార్డుల నుంచి దరఖాస్తులు తీసుకుని వాటి అర్హతలను పరిశీలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కౌలురైతు కార్డులు అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులపై చిన్న చూపు చూడటంతో కౌలురైతు కార్డులు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోలేదని ఆరోపణలు కౌలురైతు నుంచి వినిపిస్తున్నాయి.

● సీసీఆర్‌సీ కార్డు ఉంటేనే

కౌలు రైతు గుర్తింపుకార్డు(సీసీఆర్‌సీ కార్డు) ఉంటేనే కౌలురైతుకు అన్నింటా అధికారిక గుర్తింపు లభిస్తుంది. కౌలురైతు కార్డులు ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేలు లభిస్తాయి. నారుమళ్లు వేసిన ప్రస్తుత తరుణంలో ఎరువులు, పురుగు మందులు కావాలంటే సీసీఆర్‌సీ కార్డు తప్పనిసరి. ఇటువంటి పరిస్థితుల్లో కూడా ఇంకా కౌలురైతు గుర్తింపు కార్డులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడంతో కౌలు రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అలాగే తుఫానులు, భారీ వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రైతులకు రాష్ట్రప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం వంటివి వారికి అందకుండా పోతాయని వారు ఆవేదన చెందుతున్నారు. బ్యాంకు రుణం కావాలన్నా, పంట నమోదు చేసుకోవాలన్నా ఇప్పుడు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరి. అయితే ఇంత ప్రాముఖ్యమైన కౌలురైతు కార్డుల ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. గత యేడాదిలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 12302 సీసీఆర్‌సీ(కౌలురైతు కార్డులు)మంజూరు చేసారు.అయితే ఇప్పుడు12982 సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది.కానీ ఇప్పటి వరకు కౌలు రైతులకు 5714 కార్డులు మాత్రమే ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. సీజన్ ప్రారంభమై నారుమళ్లు వేసుకున్నా గానీ ఇంత వరకు కౌలురైతు కార్డులు ఇవ్వకపోవడంతో పెట్టుబడి కోసం కౌలు రైతులు అల్లాడిపోతున్నారు.

● వారం పదిరోజుల్లో పూర్తి చేస్తాం –తహసీల్దార్ నాగార్జున

సీసీఆర్‌సీ కార్డులు లక్ష్యాలకు మించి ఇవ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పుడు చాలా వరకు కౌలు రైతులకు కార్డులు మంజూరు చేశాము. మిగిలిన కార్డులు త్వరలోనే కౌలురైతులకు అందజేస్తాము. నిర్దేశించిన లక్ష్యాలే కాకుండా అర్హత ఉన్న ప్రతి రైతుకు సీసీఆర్‌సీ కార్డు ఇచ్చి తీరుతాం.గత యేడాది ఆగష్టు నెల వరకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయడంతో ఇప్పుడు వెబ్‌సైట్ గత యేడాది నమోదు చేసిన సమయానికే సీసీఆర్‌సీ కార్డు రెన్యూవల్ అవుతుంది. అందుకే కొంత అలస్యం జరుగుతుంది. కౌలు రైతులు ఆందోళన పడనవరం లేకుండా అర్హులందరికీ సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చి తీరుతాం.

కౌలురైతు కార్డుల వివరాలు:

	గత ఏడాది ఇచ్చినవి	ఈ ఏడాది లక్ష్యం	ఇప్పటివరకు ఇచ్చినవి
ఉండి	4127	4357	2200
ఆకివీడు	1996	2164	989
కాళ్ళ	1566	1848	604
పాలకోడేరు	4613	4613	1921

క్లుప్తంగా

నాగబాబును పరామర్శించిన చినమిల్లి



నాగబాబును పరామర్శిస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం గ్రామానికి చెందిన కోన నాగబాబు ఇటీవల రోటీ మెషీన్‌లోకి ప్రమాదవ శాత్తు తన చేయి వెళ్లిపోవడంతో తీవ్రగాయమై చికిత్స పొందుతుండటంతో బుధవారం భీమవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త చినమిల్లి వెంకట్రాయుడు పరామర్శించారు. అధైర్య పడవద్దని పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. నాగబాబు త్వరితగతిన ఆరోగ్య రీత్యా కోలుకుని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చినమిల్లి బాబి, శ్రీనివాస్, దీపు, వాసు, లక్ష్మణ్, గాజుల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వారాహి దేవి గ్రామోత్సవం

ఆకివీడు: శక్తి రూపాల్లో ఒకటి అయిన వారాహి దేవిని లక్ష్మీదేవి స్వరూపంగా కూడా భక్తులు కొలుస్తారని అర్చకులు మొవ్వ సుబ్రహ్మణ్య రవి అన్నారు. స్థానిక పిల్లల మర్రి అగ్రహారంలోని వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో గత 13 రోజులుగా ఉదయం, రాత్రి పూట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రోజూ హోమం నిర్వహించారు. ఆఖరి రోజు మంగళవారం పూర్ణాహుతి జరిగింది.ఈ సందర్భంగా బుధవారం అమ్మవారిని పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి గ్రామోత్సవంను తిలకించారు.

విద్యాసామగ్రి పంపిణీ

వీరవాసరం: వీరవాసరం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ పాఠశాల విద్యార్థులకు బుధవారం నోటుబుక్స్, బిస్కెట్లు అందజేశారు. విద్యార్థులు తమ ప్రతిభను బయటకు తీసి విద్యాభ్యాసం చేయాలని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, పంచాయతీ సభ్యుడు గుండా వెంకట నరసింహారావు, గుద్దటి స్వామీజీ, గాయత్రి, కె. విజయలక్ష్మి, కుంచె వేణు, గొర్రె రాధా సులోచన, అరుణ, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పాలకోడేరు: మండలం వేండ్ర గ్రామపంచాయతీ పరిధిలో గల సుబ్బరాజు పురం గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం నందు పాస్టర్ ఎం శ్యాంబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో అన్ని రక్త పరీక్షలు, దంత పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు, ఎక్స్‌రే, ఈసిజి మొదలగునవి ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటికి సంబంధించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో హైదరాబాదుకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సుమారుగా 200 మందికి పైగా వినియోగించుకున్నట్లు నిర్వాహకులు పాస్టర్ ఏ శ్యాంబాబు తెలిపారు.

విద్యారంగం అభివృద్ధికి ఏబీవీపీ చేసిన కృషి ప్రశంసనీయం

భీమవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 77వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భీమవరం పట్టణంలోని ఏఆర్‌కెఆర్ స్కూల్ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమశాఖసహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ జ్ఞానం, శీలం, ఏకతా అనే లక్ష్యంతో గత 77 ఏళ్లుగా ఏబీవీపీ విద్యార్థి రంగం అభివృద్ధి కోసం చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్, భీమవరం విభాగ్ కన్వీనర్ డిన్ను చందు, జిల్లా కన్వీనర్ రాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

భీమవరం అర్బన్: రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దని, సేకరించిన రక్తం ప్రమాదాల్లో గాయపడిన, శస్త్ర చికిత్సలు చేసిన వారికి ప్రాణాలు కాపాడటానికి ఎంతో ఉపయోగపడుతుందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు కిషోర్, మండ విజయ భాస్కర్ అన్నారు. భీమవం మండలంలోని రాయలం గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్, విజయ భాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి 5 నెలలకొకసారి రక్తదానం చేయడం వల్ల శరీరం మరింత ఉత్సాహవంతంగా మారుతుందన్నారు. యువత తరచూ రక్తదాన శిబిరాల సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికేట్స్‌ను అందజేశారు. ఈ రక్తదాన శిబిరంలో కోశాధికారి బొండా సుబ్బారావు, అక్షింతల సత్య సురేష్, ముంగేష్, రోటరీ క్లబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సహకార వ్యవస్థ ముఖ్య ఉద్దేశం

భీమవరం (ప్రకాశంచౌక్): రైతు సంక్షేమమే సహకార వ్యవస్థ ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా సహకార పరపతి బ్యాంక్ జనరల్ మేనేజర్ కాదంబరి శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా సహకార బ్యాంక్ లో అంతర్జాతీయ సహకార వ్యవస్థ వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో సహకార సంఘాలు 2000 లకు పైగా ఉన్నాయని, మన జిల్లాల్లో 258 సంఘాలున్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాంక్‌ల వ్యవస్థపై పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

పేదోళ్లకు సాయం చేసే పెన్నిధి వైఎస్సార్ కుటుంబం



11వ వార్డులోని సంచార జాతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆకివీడు: పేదోళ్లకు సాయం చేసే పెన్నిధి వైఎస్సార్ కుటుంబమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గుండా సుందర రామనాయుడు చెప్పారు. స్థానిక 11వ వార్డులోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద ఉన్న సంచార జాతులకు వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య సూచనల మేరకు బుధవారం పార్టీ బీసీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కురెళ్ల పోలు సహకారంతో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుందరరామనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు అభివృద్ధి చెందాయన్నారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకంతో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత శిఖరాల్ని అధిరోహించారన్నారు. వారి ఆర్థిక స్థితి మెరుగుపడిందన్నారు. తండ్రికి తగ్గ తనయుడుగా వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల్ని లక్షాధికారుల్ని చేసిందన్నారు. సంచార జాతులు ఎందరికో ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకునేందుకు సహకరించారన్నారు. నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు పునర్జన్మనిచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కురెళ్ల పోలు మాట్లాడుతూ సంచార జాతుల ప్రజల్ని గత పాలకులు ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో పేదల అభివృద్ధికి అన్ని విధాలుగా పథకాలు తోడ్పడ్డాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు ఎండీ. సిద్ధిక్, కౌన్సిలర్ దొడ్డి జగదీష్ పాల్గొన్నారు.

భర్తపై ఫిర్యాదు

భీమవరం: విడాకులు ఇవ్వకుండా తన భర్త వేరొకరిని వివాహం చేసుకున్నాడంటూ భీమవరం పట్టణానికి చెందిన కె. దివ్యభవాని ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. 2017లో హైదరాబాద్లో ఆర్యసమాజంలో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం నుంచి ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. ఎస్సై ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఉండి: అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులు భరించలేక భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన శాంతికి పాలకోడేరు మండలం మోగల్లుకు చెందిన పాలపర్తి నాగయ్యతో 2018 ఫిబ్రవరి 12వ తేదీన వివాహమైంది. వివాహ సమయంలో 1.60 లక్షలు, పావుకాసు బంగారం కట్నంగా అందజేసారు. వివాహానంతరం చెడు వ్యసనాలకు అలవాటుపడిన నాగయ్య అదనపు కట్నం రూ.2 లక్షలు తేవాలంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. అయితే ఇటీవల వేధింపులు మరీ ఎక్కువ కావడంతో పాటు కొట్టడంతో ఆమె పుట్టినింటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలవపూడి సొసైటీలో నూరు శాతం వసూళ్లు

కాళ్ల: కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 2024–25 సంవత్సరానికి రైతుల నుంచి రుణ బకాయిలను నూరు శాతం వసూలు చేసినట్లు సొసైటీ సీఈవో కనుమూరి మణి బుధవారం తెలిపారు. సంఘ సభ్యుల నుంచి రావాల్సిన వివిధ రకాల రుణాలు మొత్తం సుమారు రూ.6 కోట్లు వసూలు చేసినట్లు వివరించారు. గత 13 ఏళ్లుగా నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని సహకార సంఘాల కంటే ముందుగా రికవరీ చేసి ఆదర్శ సంఘంగా నిలుస్తుందన్నారు. దీనికి సహకరించిన సంఘ సభ్యులకు, సిబ్బందికి, రైతులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామంలో మురుగు లేకుండా చర్యలు



బొండాడ పేటలో ప్రోక్లెయిన్ తో మురుగు వెళ్లేందుకు డ్రెయిన్ తవ్వుతున్న దృశ్యం

కాళ్ల: గ్రామంలో మురుగునీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ గుడ్ల మధుసూదన రావు తెలిపారు. బొండాడ పేట గ్రామంలో సుమారు కిలోమీటర్ మేర మురుగు డ్రెయిన్ ఏర్పాటు పనులను బుధవారం గ్రామ సర్పంచ్ గ్రామపెద్దలతో పాటు పరిశీలించారు. గ్రామంలో పంచాయతీ నిధులు రెండు లక్షల నలభై వేల రూపాయలతో డ్రెయిన్ తవ్వకం పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనివల్ల మురుగు నీరు నిలువ లేకుండా నేరుగా మురికి కాలువలు ఎందుకు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామ పరిరక్షణ కొరకు వర్షాకాలంలో గ్రామం ముంపు బారిన పడకుండా మొగదిండి డ్రైన్ నుండి పోరబోదె వరకు డ్రైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తికొండ సత్యనారాయణ, గ్రామ పెద్దలు దాసరి వెంకటరామరాజు, గుడ్ల వరాహవతారం, పంచాయతీ కార్యదర్శి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అయోధ్యకూ ప్రత్యేక రైలు



స్థానిక రైల్వే స్టేషన్‌లో అరుణాచలం ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు: తీర్థయాత్రలకు వెళ్లే ప్రయాణీకులకు దక్షిణ మధ్య రైల్వే జిల్లాలోని డెల్టా ప్రాంతమైన నర్సాపురం నుంచి అనేక రైల్లు నడుపుతోందని, రాబోయే రోజుల్లో అయోధ్యకు కూడా కొత్త రైలు నడిపే యోచనలో ఉండటం అభినందనీయమని నగర పంచయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. నర్సాపురం నుంచి తిరువన్నామలై(అరుణాచలం)కు వెళ్లే రైలు బుధవారం ప్రారంభం కాగా మధ్యాహ్నం ఆకివీడు రైల్వే స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైలు డ్రైవర్‌ను చైర్‌పర్సన్ హైమావతి, జంపన సుబ్రహ్మణ్యం రాజు(జేఎస్సార్)సత్కరించారు. స్వీట్లు అందజేశారు. జై అరుణాచలేశ్వరా అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఉప సభాపతి కె.రఘురామకృష్ణంరాజుల చొరవతో రైలును ప్రారంభించడం హర్షదాయకమన్నారు. నర్సాపురం నుంచి షిర్డి, తిరుపతితో పాటు ప్రస్తుతం అరుణాచలం వెళ్లే రైళ్లను భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కురెళ్ల పోలు, కొటికలపూడి సూర్యనారాయణ(ఎర్రప్రసాద్), కనుమూరు రాంబాబు, తస్నేల్‌రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మిత్రుడికి సాయం అందజేస్తున్న దృశ్యం

వీరవాసరం: అనారోగ్యానికి గురైన తమ మిత్రుడికి మిత్ర బృందం అంతా కలిసి ఆపన్న హస్తం అందించి ఆదర్శంగా నిలిచారు. వీరవాసరం ఎం.ఆర్.కె జెడ్పీ హైస్కూల్ 1986–87 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తన మిత్రుడు దుండి సూరయ్య అనారోగ్యానికి గురికావడంతో వైద్యం నిమిత్తం బుధవారం కొంత మొత్తాన్ని ఆ కటుంబానికి అందజేశారు. వీరంతా గత ఐదు సంవత్సరాలుగా ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని వారంతా ఆ గ్రూపు ద్వారా కష్టసుఖాలను పంచుకుంటున్నారు. ఈ విధంగా తమ మిత్రులలో ఒకరైన దుండి సూరయ్య అనారోగ్యానికి గురికావడంతో ఆవేదన చెందారు. సూరయ్యకు ఆర్థికంగా సహాయ పడాలన్న ఆలోచన వచ్చిందే తడవుగా మిత్రులంతా తల కొంత వేసుకొని మొత్తం రూ.61వేలను వైద్యం నిమిత్తం సూరన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరి వెంకటలక్ష్మి, ఉన్నమట్ల మోహన్ రావు, ముద్రగడ శ్రీనివాసరావు, గవిరెడ్డి శ్రీనివాసరావు, కంచర్ల బాబి, పంతంరాము, బాజంకి సన్యాసి రావు, చికెలే చిట్టిబాబు, మల్లుల జై కృష్ణ, ఆర్ కె నాయుడు, పంజా శ్రీనులు పాల్గొన్నారు.

దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



ఎన్నార్పీ అగ్రహారం హైస్కూల్ వద్ద దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్సై

ఉండి: ఆపరేషన్ సేఫ్ క్యాంపస్‌జోన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆద్నాన్ నాయీం ఆదేశాల మేరకు ఉండి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని హైస్కూల్స్ పరిసరాల్లో దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ఉండి పీస్ పరిధిలోని అన్ని జెడ్పీ హైస్కూల్స్ సమీపంలోని పలు దుకాణాలలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు అక్రమంగా కలిగి క్రయ విక్రయాలు చేసే దుకాణాలపై చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పోలీసుల ఆదేశాలను దిక్కరిస్తూ చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అరుణాచలంకు ప్రత్యేక రైలు

భీమవరం: నరసాపురం నుంచి తిరువణ్ణామలై (అరుణాచలం)వెళ్లే స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను వారానికి మూడు సార్లు నడిపే విధంగా కృషి చేస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం నరసాపురంలో ప్రారంభించిన భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వరకు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో కలసి ప్రయాణించిన సందర్భంగా శ్రీనివాసవర్మ భీమవరంలో విలేకర్లతో మాట్లాడారు. భీమవరం రైల్వే స్టేషన్‌లో మంత్రి శ్రీనివాసవర్మకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) తదితరులు స్వాగతం పలికి ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీపై అవగాహన ర్యాలీ

ఉండి: ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చినపుల్లేరు గ్రామ సర్పంచ్ పెన్మత్స సావిత్రమ్మరామరాజు సూచించారు. బుధవారం గ్రామంలో ఉపాధిహామీ పథకంపై సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ రీసోర్స్‌పర్సన్ అత్యుతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ కూలీకి వందరోజుల పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయించాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఆర్థిక ఇబ్బందులు తొలగిపోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం పనులు కల్పిస్తుందని అన్నారు. గ్రామ గ్రామాన ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. డీఆర్పీ దుర్గాభవానీ మాట్లాడుతూ గత ఏడాది 45 రకాల పనులు గుర్తించి ఉపాధిహామీ పథకాన్ని నిర్వహించామని ఇప్పుడు కూడా పనులు గుర్తించి కూలీలకు పనులు కల్పిస్తున్నామన్నారు. ఉపసర్పంచ్ బొర్రా సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.


బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

వీరవాసరం: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో వీరవాసరం గ్రామంలో కడలి వెంకటేశ్వరరావు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 8మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సునీల్‌కుమార్‌లు తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం సీఐ కె. బలరామరాజు తెలిపారు.


వరల్డ్ ఫిష్ ఫార్మర్స్ డే శుభాకాంక్షలు
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
కాటా సభ్యులందరికీ
వరల్డ్ ఫిష్ ఫార్మర్స్ డే శుభాకాంక్షలు
శ్రీ భక్తాంజనేయ కమీషన్ చేపల వర్తక సంఘం
లాంచీల రేవు, ఆకివీడు



సార్వత్రిక సమ్మె పాలక వర్గాలకు చెంపదెబ్బ



వీరవాసరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

వీరవాసరం: సంబరాలు చేసుకుంటున్న కేంద్ర పాలకులకు సార్వత్రిక సమ్మె చెంప దెబ్బ వంటిదని ఇప్పటికైనా విధానాలు మార్చుకోవాలని కార్మిక ప్రజా సంఘాలు హెచ్చరించారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా వీరవాసరంలో ఉద్యోగులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ సభ నిర్వహించారు. స్కూల్స్ సంస్థలు, బ్యాంకులు మూతపడ్డాయి. రైస్‌మిల్ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు ఆటో కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు సత్యవతి, నిర్మల, లక్ష్మి, ఆశ వర్కర్ సీనియర్ నాయకులు వరలక్ష్మి, సంతోష్ వాణి, బేబీ, దుర్గ రైస్ మిల్ వర్కర్ యూనియన్ నాయకులు కొత్తల సత్తిబాబు, రమణ వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు అలమహారాజు, రాము, నారాయణమూర్తి, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలి

పాలకోడేరు: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకి వ్యతిరేకంగా ఐక్యంగా ఏకముక్తకంఠంతో కార్మికులంతా ముందుకు వచ్చి పోరాటం చేయాలని కార్మిక వర్గానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి కల్యాణి పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గోపాలరాజు, అంగన్‌వాడీ యూనియన్ సీహెచ్ విమల, ఆశ యూనియన్ డి.శాలిని, మధ్యాహ్న భోజనం డి. మరియమ్మ, పంచాయతీ యూనియన్ నాయకులు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కాళ్ల: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రం కాళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె విజయవంతం అయింది. కార్మికులు లేబర్ కోడలు రద్దు చేయాలని కార్మిక చట్టాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభకు మండా సూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల్ని బానిసలుగా భావించి పెట్టుబడుదారులకి శ్రమ దోపిడీ చేయించేందుకే కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడలు తీసుకొచ్చిందని వెంటనే రద్దుచేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం లీడర్ దావులూరి మార్తమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ లీడర్స్ పైడితల్లి, దగ్గులూరి అనిత, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు పశువులేట్ సత్యనారాయణ, పుట్టబోతుల మధు, తానుకొండ వెంకటేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గండికోట వెంకటేశ్వరరావు, పొనుకొండ సూర్యనారాయణ తదితరులుఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
90108 51166
Office mail : tpgadvt@gmail.com